


# మనం

తూర్పు పశ్చిమ, కృష్ణ జిల్లాలు

శనివారం 28- 06 - 2025

4 పేజీలు




# రక్తదానం చేయడం ఒక గొప్ప సేవ

## ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య




**జగ్గయ్యపేట జూన్ 27 మనం న్యూస్ :** జగ్గయ్యపేట మండలం ముక్త్యాల గ్రామ సమీపంలో గల ఫార్మా కంపెనీలో రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు వారి ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లడ్ డొనేషన్ క్యాంపులో ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ. రక్తదానం చేయడం ఒక గొప్ప సేవ. మన రక్తంతో ఎవరో ఒకరి ప్రాణాలు నిలబడతాయి. ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలి. యువత ఈ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవ్వాలి. ఆరోగ్యవంతులైన ప్రతి వ్యక్తి ఏడాదిలో కనీసం రెండు సార్లు రక్తదానం చేయడం అవసరం. రక్తదానం చేయడం వల్ల శరీరానికి కూడా లాభాలే ఉన్నాయి. మనం ఇవ్వగలిగే గొప్ప బహుమతి ు మన రక్తం అన్నారు. తల సేమియా వ్యాధి వారికి వారానికి ఒకసారి రక్తం ఎక్కించాల్సి ఉంటుంది అటువంటి అప్పుడు బ్లడ్ చాలా అవసరం ప్రమాదాలు సర్జరీలు కావచ్చు బ్లడ్ చాలా అవసరం పడుతుందన్నారు. బ్లడ్ ఇవ్వడం వలన ఎటువంటి ఇబ్బంది ఉండదు, దీనిమీద అవగాహన లేక, అవకాశం లేక చాలామంది ముందుకు రాలేకపోతున్నారు అన్నారు. తాను కాలేజీలో చదువుకునే రోజుల్లో నుంచి 2016 వ సంవత్సరం వరకు 50 సార్లు పైగా రక్తదానం చేయడం జరిగిందని అన్నారు. అంతేకాక తమ 25వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారి సతీమణి శ్రీరాం శ్రీదేవి (అమ్మాజీ) తో కలిసి హైదరాబాదులోని రెడ్ క్రాస్ సంస్థ వారి ఆధ్వర్యంలో బ్లడ్ డొనేషన్ చేయడం జరిగిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కో హెన్స్ కంపెనీ రాకీమ్ గా ఉన్నప్పుడు జగ్గయ్యపేట పట్టణంలోని గవర్నమెంట్ హాస్పటల్ లో డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేశారు. జగ్గయ్యపేట తరువాత డయాలసిస్ సెంటర్ విజయవాడలోనే ఉందన్నారు. గతంలో ఉన్న మేనేజ్మెంట్ వారు ఆ విధంగా సహకరించారు. కోహన్సు వారు కూడా సహకరించి జగ్గయ్యపేటలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న రెడ్ క్రాస్ సభ్యులకు, కోహన్స్ ప్రతినిధులకు, ఉత్సాహంగా పాల్గొన్న దాతలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు సంస్థకు చెందిన రవికుమార్, కోహన్స్ ప్రతినిధులు సుబ్రహ్మణ్యం, మురళీధర్, సురేష్ మరియు కర్లపాటి శ్రీనివాసరావు, మల్లెల కొండయ్య, రాటకొండ శేషగిరి, పాతలోతు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీడీవోను కలిసిన పెద్దేవం టిడిపి నాయకులు



**తాళ్లపూడి, 27 జూన్ (మనం న్యూస్ ):** తాళ్లపూడి మండల పరిషత్ అభివృద్ధి అధికారి గా వచ్చిన మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్. వేణుగోపాల్ రెడ్డి ని మండల తెలుగుదేశం నాయకులు కొవ్వూరు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు తీగిరిపల్లి గోపి మరియు సిద్ధ దుర్గారావు, మల్లెపూడి హనుమంతరావు, మల్లిపూడి బాపూజీ రావు, కొడమంచిలి ప్రకాశం లు మర్యాదపూర్వకముగా కలిసారు.

# భవిష్యత్తు అంతా పర్యాటకానిదే

- 2047 నాటికి ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా ఏపీ
- ఏపీలో ధైర్యంగా పెట్టుబడులు పెట్టండి..స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తామని ఇన్వెస్టర్లకు భరోసా
- ఏపీ చారిత్రక వైభవం, వైవిధ్యమైన సహజసిద్ధ సౌందర్యాలను ప్రపంచానికి తెలపాలన్నదే తమ ఉద్దేశం
- విజయవాడలో ఏపీ పర్యాటకాభివృద్ధి కోసం గ్లోబల్ ఫోరం ఫర్ సస్టైనబుల్ టూరిజం, ఏపీటీడీసీ సంయుక్తంగా నిర్వహించిన టూరిజం కాన్ క్లేవ్ టెక్ ఏఐ 2.0లో మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి
- టూరిజం కాన్ క్లేవ్ లో రాష్ట్ర పర్యాటక విధానాలు, నిర్దేశిత లక్ష్యాల వివరణ










**విజయవాడ జూన్ 27 మనం బ్యూరో :** ఏపీలో టూరిజం ప్రాజెక్టుల వేగవంతం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, పర్యాటకులకు ప్రపంచస్థాయి అనుభవాల కల్పన, స్థానిక భాగస్వామ్యాలకు ప్రయోజనం చేకూర్చేందుకు ఇన్వెస్టర్ల సహకారం అవసరమని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. శుక్రవారం విజయవాడ ఎంజీ రోడ్డులోని మురళీ ఫార్చ్యూన్ హెూటల్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటకాభివృద్ధి కోసం గ్లోబల్ ఫోరం ఫర్ సస్టైనబుల్ టూరిజం, ఏపీటీడీసీ సంయుక్తంగా రెండోరోజు నిర్వహించిన టూరిజం కాన్ క్లేవ్ టెక్ ఏఐ 2.0 లో సీఎం చంద్రబాబునాయుడు, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. తొలి రోజు పర్యాటక రంగ అభివృద్ధికి దోహదపడే అంశాలపై చర్చ జరగగా, రెండో రోజు రాష్ట్ర పర్యాటక విధానాలు, నిర్దేశిత లక్ష్యాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఏపీ పర్యాటకం పెట్టుబడులకు అనుకూలమని, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ఆలోచనలు పంచుకొని పెట్టుబడులతో వస్తే భరోసా కల్పించే బాధ్యత తమది అని ఇన్వెస్టర్లకు హామీ ఇచ్చారు. తొలిరోజు పర్యాటక రంగ అభివృద్ధికి దోహదపడే అంశాలపై జరిగిన చర్చలో ఇన్వెస్టర్ల సలహాలు, సూచనలు పరిగణలోకి తీసు కుంటామని తెలిపారు. 2047 నాటికి రాష్ట్రాన్ని ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అంతర్జాతీయ పర్యాటకుల గమ్యస్థానంగా ఏపీని తీర్చి దిద్దుతామని పేర్కొన్నారు.

వివరాలు 2లో..



# భవిష్యత్తు అంతా పర్యాటకానిదే






(మొదటి పేజి తరువాయి )

**విజయవాడ జూన్ 27 మనం బ్యూరో** :ఏపీలో పర్యాటకరంగానికి సీఎం చంద్రబాబునాయుడు పారిశ్రామిక హోదా కల్పించడంతో అభివృద్ధికి ఊతం వచ్చిందని, అనంతరం పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయన్నారు. ఈ క్రమంలో పర్యాటకులకు మరింత చేరువయ్యేందుకు, ప్రాంతాల సందర్శన ద్వారా ప్రజలతో కనెక్ట్ అవ్వడం, అనుభూతి చెందడం, జీవితకాల జ్ఞాపకాలను కల్పించాలన్నది తమ ఉద్దేశమని చెప్పారు. ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టేందుకు ఇది సరైన సమయమని సూచించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో పర్యాటక రంగం ఏ విధమైన అభివృద్ధి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో టూరిజం రంగం నిరాదరణకు గురైందన్నారు. టూరిజంలో ఆకాశమే హద్దు..అవకాశాలను వదలవద్దు అన్న సీఎం మాటలు ఇన్వెస్టర్లకు ఈ సందర్భంగా గుర్తుచేశారు. పర్యాటక రంగానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని మంత్రి దుర్గేష్ వివరించారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పనతో పాటు ఇప్పటికే 2024-29కి నూతన పర్యాటక పాలసీ ప్రకటించామని తెలిపారు. సుస్థిర, సమగ్ర పర్యటకాభివృద్ధికి బాటలు వేస్తున్నామని పేర్కొన్నారు. బాధ్యతాయుత పర్యాటకాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. ఏపీలో ఆర్థిక అభివృద్ధి, యువతకు ఉపాధి కల్పనే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. పర్యాటకాభివృద్ధి ద్వారా అన్ని ప్రాంతాల అభివృద్ధి జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాబోయే కాలంలో ఏపీ పర్యాటకాభివృద్ధి చెందుతుందని మంత్రి దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు. ఏపీని అద్భుత పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఇప్పటికే స్వదేశీ దర్శన్ 2.0, ప్రసాద్, శాస్కి, సీబీడీడీ స్కీమ్ ల ద్వారా వందలాది కోట్ల నిధులు కేంద్రం మంజూరు చేసిందని తద్వారా పర్యాటక అభివృద్ధి పట్టాలెక్కుతుందన్నారు. పీపీపీ విధానం ద్వారా పర్యటకాభివృద్ధి చేస్తున్నామన్నారు. జూన్ 26న రూ.94.44 కోట్లతో అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టుకి శంకుస్థాపన చేశామని గుర్తుచేశారు. ఏపీలోని 974కి.మీల సుదీర్ఘ సముద్రతీరం, సహజ సౌందర్యాలను,చారిత్రాత్మక కట్టడాలను ప్రపంచానికి చూపించాలన్నదే తమ లక్ష్యమని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ఏపీలో వెల్ నెస్ సెంటర్లను వృద్ధి చేస్తే పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తామని యూరోపియన్లు తన జర్మనీ పర్యటనలో వెల్లడించారని మంత్రి దుర్గేష్ గుర్తుచేశారు. ఏపీ నాయకత్వంపై కేంద్రానికి స్పష్టమైన నమ్మకం ఉందని, త్వరలో పర్యాటకం మరింత పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల చొరవతో ఎకో టూరిజం పాలసీ తెస్తున్నామని తద్వారా జీవ వైవిధ్య పరిరక్షణ, ప్రకృతి సంరక్షణ చేపడతామన్నారు. అడ్వెంచర్, ఎకో టూరిజంలో పెట్టుబడుల ఆకర్షణ, పర్యాటకులకు మెరుగైన అనుభవాల కల్పిస్తామన్నారు. బ్రాండింగ్, మార్కెటింగ్, ఉత్పత్తి, ప్రాజెక్టులు, పెట్టబడులు, భాగస్వామ్యం, టెక్ ఎనేబుల్ మెంట్, క్రియేటివ్ ఎకానమీ,కెపాసిటీ బిల్డింగ్ తదితర 6 అంశాలపై ఏపీ పర్యాటక రంగం ముందుకు తీసుకువెళ్తున్నామని మంత్రి దుర్గేష్ వివరించారు. పర్యాటక ప్రాజెక్టులకు సింగిల్ విండో ద్వారా అనుమతులు జారీ చేస్తున్నామన్నారు. దేశంలో టెక్నాలజీకి ఆద్యులు సీఎం చంద్రబాబు అని సాక్షాత్తు ప్రధానమంత్రి నరేంద్రమోదీనే చెప్పారని గుర్తుచేశారు. డీప్ టెక్, క్వాంటం కంప్యూటింగ్, ఏఐ తదితర టెక్నాలజీలపై తొలిసారి మాట్లాడిన వ్యక్తి సీఎం చంద్రబాబునాయుడు అని మంత్రి అన్నారు. ఏపీలో సృజనాత్మకతకు పెద్ద పీట వేసి తద్వారా ఆదాయాభివృద్ధి, అవకాశాలు కల్పిస్తామన్నారు. ఏపీని స్వర్ణాంధ్ర- 2047 దిశగా తీసుకెళ్తామన్నారు. దీర్ఘకాలిక పర్యాటకానికి రాచబటలు వేస్తున్నామని, పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తామని చెబుతూ గత ప్రభుత్వ విషాదఛాయలు మర్చిపోవాలని ఇన్వెస్టర్లకు సూచించారు. ఏపీలో ధైర్యంగా పెట్టుబడులు పెట్టండి..స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తామని ఇన్వెస్టర్లకు భరోసానిచ్చారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక అభివృద్ధితో పాటు ప్రపంచస్థాయి ఆకర్షణగా రాష్ట్ర







పర్యాటకాన్ని శక్తివంతమైన సాధనంగా చేయాలన్నదే తమ లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాష్ట్ర సాంస్కృతిక వారసత్వం, చారిత్రక వైభవం, వైవిధ్యమైన సహజసిద్ధ సౌందర్యాలను ప్రపంచానికి తెలపాలన్నదే తమ ఉద్దేశమన్నారు. ఈ క్రమంలో 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ ను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు.

# పంచాయితీ కార్యదర్శులు పారిశుధ్యం నిర్వహణ లోపం లేకుండా చూడాలి

### ఎంపీడీవో బిఎస్ఎల్ మంగ కుమారి.
### చెత్త నుండి సంపద సృష్టిస్తాం.
### పూర్తిస్థాయి ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుతాం.

**పోడూరు జూన్ 27 మనం న్యూస్ :** పోడూరు మండల వ్యాప్తంగా 16 గ్రామాల పంచాయతీ కార్యదర్శులు వారి వారి గ్రామాల్లో పారిశుద్ధ్యం నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా పూర్తిస్థాయి పారిశుధ్యం నిర్మూలన చేపట్టాలని ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులకు తెలియజేశామని అన్నారు. శుక్రవారం పోడూరు మండల ప్రజా పరిషత్ ర్యాలయంలో ఎంపీడీవో బిఎస్ఎల్ మంగా కుమారి మనం పత్రిక విలేకరులతో మాట్లాడి పలు విషయాలను పంచుకున్నారు.వాటిలో భాగంగా వచ్చేది వర్షాకాలం సీజన్ కావడంతో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని ప్రజలు డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ వంటి ప్రాణాంతకమైన రోగాల బారిన పడకుండా పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పారిశుధ్యం నిర్మూలన చేపట్టాలని అలాగే తడిగా ఉన్న ప్రదేశాలను గుర్తించి బ్లీచింగ్, క్లోరినేషన్ తో శానిటేషన్ చేసి దోమలు పెరగకుండా



దోమల మందును కూడా పిచికారి చేయించి ఆయా గ్రామాల ప్రజలు రోగాల బారిన పడకుండా కాపాడాలని ఆదేశాలు జారీ చేశామని తెలియజేశారు.అంతేకాకుండా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలను పూర్తిస్థాయి ప్లాస్టిక్ నిర్మూలన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని దానికి అనుగుణంగా గ్రామాల్లో ఏ దుకాణం లోనూ ప్లాస్టిక్ కవర్లు అమ్మ కుండా పంచాయతీ కార్యదర్శులు ద్వారా చర్యలు చేపడుతున్నామని అన్నారు.మరి ముఖ్యం గా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాలను అనుచరించి తడి చెత్తను పొడి చెత్తను వేరు వేరు గా సేకరించి చెత్తనుండి సంపద సృష్టికి పాటుపడుతున్నామని తెలిపారు.ఈమధ్య ప్రభుత్వం ఆదేశాలు ప్రకారం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులు అందరూ కష్టపడి సచివాలయం సిబ్బందితో యోగా చేసేవారిని గుర్తించడం వలన యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం గా పూర్తి చేయడం జరిగిందని అన్నారు.మునుముందు ప్రభుత్వ ఆదేశాలకు లోబడి ఎటువంటి కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రకటించిన ఆ కార్యక్రమంలో విజయం సాధించగలుగుతామని తెలిపారు.అలాగే గ్రామాల్లోని ప్రజలు కూడా ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా, ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి కుంటలు నిలవ లేకుండా చూసుకుని ఎవరికి వారు తమ ఆరోగ్యాలను రక్షించుకోవాలని అలాగే పంచాయతీ వారికి ప్రజలు సహకరించాలని మండల వ్యాప్తంగా గ్రామ ప్రజలను కోరుతున్నామని అన్నారు.

# కూటమి ప్రభుత్వ విధానాలతో ట్రాన్స్‌పోర్ట్ రంగం కుదేలు

### జగ్గయ్యపేట నుంచి నున్న కు వాహనాలను తీసుకురమ్మనడం దారుణం
### ఆటో ఫిట్నెస్ స్టేషన్స్ నూతన విధానాన్ని రద్దు చేయాలి.
### జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు




**జగ్గయ్యపేట జూన్ 27 మనం న్యూస్** :కూటమి ప్రభుత్వ విధానాలతో ట్రాన్స్‌పోర్ట్ రంగం కుదేలు అవుతోందని ఆటో ఫిట్నెస్ స్టేషన్స్ నూతన విధానాన్ని రద్దు చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్సిపి కార్యాలయం నందు శుక్రవారం నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన ఆటో ఫిట్నెస్ స్టేషన్స్ నూతన విధానాన్ని రద్దు చేయాలని తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. జగ్గయ్యపేట నియోజకవర్గం మొత్తం మీద పదివేల వాహనాలు ఉంటే ఆ వాహనాలు ఫిట్నెస్ కోసం నున్న దాకా తీసుకెళ్లడం వల్ల ట్రాన్స్‌పోర్ట్ ఖర్చు మొత్తం సామాన్యుడి పై పెను భారం పడుతుంది అన్నారు. ఆటో, రైతు సంబంధించిన ట్రాక్టర్ పల్లెటూరు నుంచి నున్నకి పోవాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని, మార్గమధ్యలో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు అని ప్రశ్నించారు. ఆటో పరిమితి 60 కిలోమీటర్ల వరకే పరిమితి ఉంటుంది 60 కిలోమీటర్ల దాటి ఒక కిలోమీటర్ ఎక్కువ వెళ్లిన ఏదైనా ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ వాళ్లు ఒక్క రూపాయి కూడా చెల్లించరు అలాంటిది ఫిట్నెస్ కోసం 90 - 100 కిలోమీటర్లు ఉన్న విజయవాడ దగ్గర నున్న కి రమ్మంటాం ఎంతవరకు సమంజయం అన్నారు. ఒకపక్క పెట్రోల్ డీజిల్ రేట్లు విపరీతంగా పెంచి మరోపక్క టాక్స్ ల రూపంలో సామాన్యపై నడ్డి విడుస్తున్నారు అని విమర్శించారు. బిగ్రీన్ టాక్స్ అనేది ఉంటుంది ఆ గ్రీన్ టాక్స్ 3000 నుంచి 30000 వరకు పెంచారు ఉన్న 3000 ఉంచితే బాగుంటుందని ప్రజలు అభిప్రాయ ఒపడుతున్నట్లు తెలిపారు. వ్యవస్థలన్నీ ఏకీకృతం చేస్తూ, ఏ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఆ కేంద్ర ప్రాంతాల్లో ఫిట్నెస్ ఇవ్వాల్సిన ఈ సర్టిఫికెట్స్ జిల్లా హెడ్ క్వార్టర్ అయినా విజయవాడ నున్న దగ్గరికి ప్రైవేటు ఏజెన్సీ విధానం అమలపరిచి ట్రాన్స్పోర్ట్ వాళ్ళ దగ్గర డబ్బులు దండుకోనే కార్యక్రమం చేస్తున్నారు అన్నారు. ఈ పరిస్థితులన్నీ దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఎప్పటిలాగే జగ్గయ్యపేట పరిధిలో ఉన్న వాహనాన్ని జగ్గయ్యపేటలో నందిగామ పరిధిలో ఉన్న వాహనాలు నందిగామలో ఫిట్నెస్ స్టేషన్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఫిరోజ్ ఖాన్, పిడమర్తి ప్రభు, దర్శి గోపి, బజార్ సాయి, జవ్వాజి నరసింహారావు, గుడపాటి శేషయ్య, పింగళి నరసింహారెడ్డి, బండిరాజు, బాణావత్ రాజు, పానుగంటి నాయుడు, ఆర్టీసీ రిటైర్డ్ షేక్ ఖాదర్ బాబు, గొట్టిపాళ్ళ సురేష్ కొత్తపల్లి సురేష్, వేముల విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## మానాపురం కు బివి రావు కళాసేవ పురస్కారం అంద జేత



**పాలకొల్లు, జూన్ 27,మనం ప్రతినిధి :** గుంటూరు కి చెందిన ప్రముఖ పౌరాణిక రంగస్థలం కళాకారులు బివి రావు స్మారకార్థం ఏర్పాటు చేసిన బివి రావు కళాసేవ పురస్కారాన్ని పాలకొల్లు కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి మానాపురం సత్యనారాయణకు అందజేశారు. ప్రముఖ నాటక రచయిత, దర్శకులు,కళా రత్న కావూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో బీవీ రావు కుమారులు ఈ పురస్కారాన్ని అందజేశారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్ లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై ఈ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా నాలుగు దశాబ్దాలుగా నాటక రంగానికి సేవలందించిన మానాపురం సత్యనారాయణ ను అవార్డుకు ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటూరుకు చెందిన ప్రముఖ రంగస్థలం కళాకారులు చెరుకూరి సాంబశివరావు, వరికూటి శివప్రసాద్, చిలకలూరిపేట ప్రసాద్, టీవీ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. మానాపురం సత్యనారాయణ కు బి వి రావు కళాసేవా అవార్డు రావడం పట్ల పాలకొల్లు కళాపరిషత్ అధ్యక్షుడు కె.వి.కృష్ణవర్మ ,గౌరవ అధ్యక్షులు మేడికొండ శ్రీనివాసరావు చౌదరి కార్యదర్శి జక్కంపూడి కుమార్ ఉపాధ్యక్షులు డాక్టర్ కె ఎస్ పి ఎన్ వర్మ,విటాకుల రమణ కోశాధికారి కొనిజేటి గుప్త, దాసరి నాని ,రెడ్డి వాసు ,షేక్ పీర్ సాహెబ్ కొల్లి కొండ ప్రసాద్ ,సోమంచి శ్రీనివాస శాస్త్రి ,నడపన శ్రీనివాస్ అంగర వీరభద్ర కుమార్, జి ఎస్ ఎన్ రవి, పట్టణ నటీనట సంక్షేమ సమాచా ర అధ్యక్షులు తాళాబత్తుల వెంకటేశ్వరరావు కార్యదర్శి గుడాల హరిబాబు కొంతేరు యూత్ క్లబ్ కార్యదర్శి గంటా ముత్యాల నాయుడు తదితరులుఅభినందనలు తెలియజేశారు.

## విద్యార్థులకు భోజన పళ్ళాల బహుకరణ



**పాలకొల్లు, జూన్ 27,మనం ప్రతినిధి :** మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, గాంధీనగర్( పందిగుంట) నందు విద్యాభ్యసించుచున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేయడానికి పళ్ళాలను కేసీరాజు కృష్ణ ( గజల్స్ కృష్ణ) శ్రీ వరసిద్ధి వినాయక స్వామి పేరుమీద అందించారు. ఈ కార్యక్రమంలో దొడ్డా శ్రీనివాసరావు , పాముల రజనీకుమార్ , కే వి ఆర్ కే మోహన్ , కుర్మా గణేష్ , పాలపర్తి జాన్సన్ , పాఠశాల వైస్ ఛైర్మన్ కె దుర్గారాణి , అంగన్వాడీ కార్యకర్త బి అభిరాణి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. దాత మరియు మా సోదరులు శ్రీ కేశిరాజు కృష్ణ ( గజల్స్ కృష్ణ) కి, కార్యక్రమంలో పాల్గొన్న పెద్దలు అందరికీ కృతజ్ఞతలు.ప్రధానోపాధ్యాయులు సురేష్ బాబు కృతజ్ఞతలు తెలిపారు.

## రైస్ మిల్లులో పిడిఎస్ బియ్యం నిల్వలు....

### పట్టించుకోని యంత్రాంగం

**గొల్లప్రోలు జూన్ 27 మనం న్యూస్ :** గొల్లప్రోలుపట్టణగ్రామీణప్రాంతాలరైస్ మిలు్లప్రభుత్వ నిబంధనలకు విరుద్ధం గా.రేషన్ బియ్యంలావాదీవీలుజోరు అందుకున్నాయి.గత వైసిపిప్రభుత్వం లో అక్రమాలకు అలవాటుపడిన పిఠాపురం గొల్లప్రోలు రైస్ మిల్లర్స్ సీఎంఆర్ పేరుతో.ప్రభుత్వంపేదలకు అందిస్తున్న సౌక బియ్యాన్ని వివిధ అక్రమమార్గాలలో దోపిడీ చేస్తూ ప్రభుత్వం కళ్ళుకప్పి రైస్ మిల్లులు నుండిసీఎంఆర్ ఎగుమ తుల్లో భాగం గా గొల్లప్రోలుఇతర ప్రాంతాల గిడ్డంగు లకురీసైక్లింగ్ చేసి మళ్ళిస్తున్నారు అన్నఆరోపణలుగట్టిగానే వినిపిస్తున్న యి. మరోవైపు రైస్ మిల్లర్లు సీఎంఆర్ పేరు చెప్పుకుని పరిమితికి మించిన భూములు భవంతులు బంగారం ఇలాంటి ఆస్తులను పెద్ద ఎత్తున కూడా పెట్టుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.గొల్లప్రోలు మండ లంలో రైస్ మిల్లర్స్ రేషన్ బియ్యం ఆగడాలకు హద్దులు లేకుండా పోయాయని ప్రజలు ఆరోపిస్తున్నారు సీఎంఆర్ బియ్యంబదులుగా పిడిఎస్ బియ్యం గొల్లప్రోలు చేబ్రోలు ప్రత్తిపాడు రైస్ మిల్లర్ల కు.రేషన్ బియ్యదవ్యాపారం కాసులు వర్షం కురిపిస్తుందని దీనిపై సంబంధిత.అధికారులు రైస్ మిల్లర్స్ దందాను నిరోధించవలసిన రెవెన్యూ పోలీస్ పౌరసరఫరాల విజిలెన్స్ అధికారులు నిద్ర అవస్థలో కొట్టు మెట్లు ఆడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై జిల్లా కలెక్టర్ శాన్మోహన్ అక్రమరేషన్ బియ్యం నిల్వలాపై కొరడా ఝులిపించాలని గొల్లప్రోలు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు..

## లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించిన పిఠాపురం జనసేనపార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి.





**గొల్లప్రోలు.జూన్ 27 మనం న్యూస్ :** జనసేనపార్టీ అధినేత పిఠాపురం శాస నసభ్యుడు రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు వాతావరణం మార్పు కారణంగా 4.రోజ లనుండి కురుస్తున్న వర్షాలను సైతంలెక్కచేయకుండా శుక్రవారం పిఠాపురం అనపర్తి. జనసేనపార్టీ ఇంచార్జ్ మర్రెడ్డి శ్రీనివాసరావు బాధితులకు మండల కేంద్రమైన పట్టణగ్రామీణప్రాంతాలలోఇంటింటికి వెళ్లి సీఎం రిలీఫ్ ఫండ్7 చెక్కులను బాధితులకు 8.38.609.రూపాయలు ముఖ్యమంత్రి ప్రత్యేకనిధులచెక్కుల ను. ఇన్చార్జి మర్రెడ్డి పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఆయనవెంట పిఠాపురం సీనియర్ జనసేన పార్టీ నాయకులు పిఠాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ దేవి సూర్య ప్రకాష్ పిల్లా శివకుమార్ కురుమళ్ళ రాంబాబు చెల్లుబోయిన సతీష్ విశ్రాంతి పోలీస్ ఆఫీసర్ బొజ్జ లావరాజు సినీహీరో మొగలిరాజా బస్సాచిట్టిబాబు మామిడాల సూరిబాబు. తలారి శ్రీనివాస్ పేకేటి సుబ్రహ్మణ్యం బస్సాకామరాజు. అక్కిరెడ్డి శ్రీనివాసు బుడంకాయల దొరబాబు కూరాకులచంద్రబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కమనీయం... జగన్నాథుని రథయాత్ర





**ముదినేపల్లి , 27 జూన్ మనం న్యూస్ :** శ్రీ జగన్నాధుని రథయాత్ర పురవీధుల్లో దకనులకు విందుగా కమనీయంగా సాగింది. ముదినేపల్లి మండలం వడాలి (చినపూరి)లో వేంచేసియున్న శ్రీ సుభద్రా బలరామ సహిత శ్రీ జగన్నాథస్వామి వారి ఆలయంలో రథసప్తమి సందర్భంగా పురవీధులలో స్వామివారి రథయాత్ర సాగింది. ఆలయం వద్ద ఆలయం ఇఓ సింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణ , భాజా భజంత్రీలతో ప్రారంభమైన రథయాత్ర వడాలి , ముదినేపల్లి , శ్రీహరిపురం , సింగరాయపాలెం గ్రామాల్లో పురవీధుల్లో భక్తులు స్వామివారిని వీక్షించుకుని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందుకుని రధాన్నిలాగారు. శ్రీజగన్నాథ స్మరణతో , శక్తి అలంకరణలతో , కేరళ వాయిద్యాలతో , గరక ముత్యాలతో, మంగళ వాయిద్యాలతో ముందుకు సాగారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కైకలూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ వీరమల్లు నరసింహారావు , మాజీ జడ్పిటిసి వీరమల్లు రత్నకుమారి , చిలకలపల్లి నాగరాజు , పరసా గంగాధరరావు , కటికల కోటేశ్వరరావు , కల్లూరి సుబ్రహ్మణ్యం , అనగాని వెంకటనరసమ్మ , రాజులపాటి వెంకటేశ్వరమ్మ , నక్క నాగలక్ష్మి , సత్యనారాయణాచార్యులు , భక్తులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన గ్రామస్తులు రాస్తారోకో

### బాధితులకు సంఘీభావం తెలిపిన సిపిఎం నాయకులు





**మైలవరం జూన్ 27 మనం న్యూస్:** స్థానిక మండలం లో చంద్రాల గ్రామస్తులు రోడ్డు నిర్మాణంలో ఇళ్లు కోల్పోయి సంవత్సరాలు గడుస్తున్న నేటికీ తమకు పరిహారం అందలేదంటూ, ఆందోళన చెందుతూ మంత్రి నారా లోకేష్ కు వినతిపత్రం అందించిన తమ సమస్యకు పరిష్కారం దొరకలేదని ఆవేదన వ్యక్తరుస్తున్నారు. ఏడు రోజులలో సమస్యకు పరిష్కారం చూపకపోతే స్థానిక తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరవధికంగా నిరసన తెలియజేస్తామన్న గ్రామస్తులు.

# భారతదేశ వృద్ధి కారిడార్లకు శక్తినిచ్చేందుకు లౌరిట్జ్ నుడ్సెన్ ఎలక్ట్రికల్ & ఆటోమేషన్ ఉత్పత్తి పోర్ట్‌ఫోలియోను ప్రారంభం

అధిక-ప్రభావ పరిశ్రమ సహకారాల ద్వారా డీప్ ఇండియాలో సాంకేతిక ప్రాప్యతను వేగవంతం చేయడానికి మరియు అవకాశాలను విస్తరించడానికి ఒక సాహసోపేతమైన వ్యూహం

10 కంటే ఎక్కువ భవిష్యత్తు-సిద్ధ పరిష్కారాలను ప్రదర్శించడానికి, అవగాహన, ప్రాప్యత మరియు స్వీకరణను స్కేల్‌లో నడిపించడానికి 30-నగరాల 'టెక్నాలజీ టూర్'ను ప్రారంభించింది.

స్థానిక అవసరాలకు అనుగుణంగా భారతదేశ పారిశ్రామిక సమూహాలకు ప్రాంతీయ-నిర్దిష్ట ఆవిష్కరణలను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది.

స్మార్ట్ ఆటోమేషన్‌తో భారతదేశం యొక్క డిజిటల్ వెన్నెముకను శక్తివంతం చేయడానికి కట్టుబడి ఉంది.

**తిరుపతి జూన్ 27( మనం న్యూస్ )** భారత విద్యుత్ మరియు ఆటోమేషన్ రంగంలో అగ్రగామి అయిన లౌరిట్జ్ నుడ్సెన్ ఎలక్ట్రికల్ మరియు ఆటోమేషన్, దేశంలోని కీలకమైన పారిశ్రామిక సమూహాలు మరియు వృద్ధి కారిడార్‌లకు శక్తినిచ్చే లక్ష్యంతో తన అతిపెద్ద ఉత్పత్తి పోర్ట్‌ఫోలియోను ఈరోజు ఆవిష్కరించింది. ఈ ప్రతిష్ఠాత్మక చొరవలో భాగంగా, బ్రాండ్ దేశవ్యాప్తంగా 30 పారిశ్రామిక నగరాల్లో పర్యటిస్తోంది - స్థానిక నాయకులు, వాటాదారులు మరియు పర్యావరణ వ్యవస్థ భాగస్వాములతో కలిసి భారతదేశ తయారీ మరియు మౌలిక సదుపాయాల కేంద్రాలలో సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించడాన్ని వేగవంతం చేస్తుంది. తక్కువ-వోల్టేజ్, పారిశ్రామిక ఆటోమేషన్ మరియు కొత్త శక్తి ప్రకృతి దృశ్యానికి పరిష్కారాలపై బలమైన దృష్టితో, లౌరిట్జ్ క్నుడ్సెన్ భారతదేశ పారిశ్రామిక వెన్నెముకలోకి లోతుగా చేరే సాంకేతికత ఆధారిత పరివర్తనను నడుపుతున్నారు. ఈ మైలురాయి ప్రచారం ప్రభుత్వ వికసిత్ భారత్ 2047 దార్శనికతకు అనుగుణంగా సాంకేతికంగా అభివృద్ధి చెందిన, ఆర్థికంగా స్థితిస్థాపకంగా మరియు శక్తి-స్మార్ట్ భారతదేశాన్ని నిర్మించడానికి కంపెనీ నిబద్ధతను నొక్కి చెబుతుంది. "లారిట్జ్ క్నుడ్సెన్‌లో, కస్టమర్‌లు సురక్షితంగా, వేగంగా మరియు తెలివిగా పని చేయడానికి వీలు కల్పించే స్మార్ట్ టెక్నాలజీలను అందించడమే మా ఉద్దేశ్యం. ఈ ఉత్పత్తి ప్రదర్శన ద్వారా, భారతదేశం అంతటా ప్రతి ప్రాంతం యొక్క ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా, అనుకూలీకరించదగినదిగా మరియు సంబంధితంగా ఆవిష్కరణలు అందుబాటులో ఉండాలి అనే మా నమ్మకాన్ని మేము బలోపేతం చేస్తున్నాము. రాయ్‌పూర్‌లోని రైస్ మిల్లును ఆటోమేట్ చేయడం, కోయంబత్తూర్‌లోని టెక్స్‌టైల్ మిల్లుకు శక్తిని అందించడం లేదా పూణేలోని ప్లాంట్‌ను ఆధునీకరించడం వంటివి అయినా, మా పోర్ట్‌ఫోలియో ప్రభావం కోసం రూపొందించబడింది, "అని లారిట్జ్ క్నుడ్సెన్ ఎలక్ట్రికల్ అండ్ ఆటోమేషన్ సి ఓ ఓ నరేష్ కుమార్ అన్నారు. "భారతదేశంలో విద్యుత్ పరికరాల రంగం 2029 నాటికి యు ఎస్ డి 95 బిలియన్లకు పైగా వృద్ధి చెందుతుందని మరియు 2033 నాటికి పారిశ్రామిక ఆటోమేషన్ యూఎస్డి 39.65 బిలియన్లకు చేరుకుంటుందని అంచనా వేయబడినందున, వేగం స్పష్టంగా ఉంది. 1 భారతీయ తయారీదారులు ఇప్పటికే తమ ఆపరేటింగ్ బడ్జెట్‌లలో 35% టెక్ ఆధునీకరణలో పెట్టుబడి పెడుతున్నారు - ప్రపంచ సగటు కంటే చాలా ఎక్కువ. ఈ మార్పులు కేవలం సంఖ్యలు మాత్రమే కాదుబీ అవి స్మార్ట్, మరింత సమర్థవంతమైన వ్యవస్థల వైపు దేశవ్యాప్తంగా డ్రైవ్‌ను ప్రతిబింబిస్తాయి. వికసిత్ భారత్ 2047 దృష్టితో సమలేఖనం చేస్తూ, మేము ఉత్పత్తులను ప్రారంభించడం లేదు - భారతదేశం స్మార్ట్, క్లీనర్ మరియు భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న రేపటికి పరివర్తన చెందడానికి మేము వీలు కల్పిస్తున్నాము," అని ఆయన జోడించారు.సమగ్ర ఎ ఈ వి ఛార్జింగ్ ఎకోసిస్టమ్ - ఈవి ఛార్జర్‌లను కలిగి ఉంటుంది, కేంద్రీకృత ఛార్జ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ , మరియు క్లౌడ్-ఆధారిత కస్టమర్ అప్లికేషన్‌లను కలిగి ఉంటుంది, ఈ పర్యావరణ వ్యవస్థ తెలివైన శక్తి పంపిణీ మరియు వినియోగదారు-కేంద్రీకృత డిజిటల్ ఇంటర్‌ఫేస్‌లతో ఎలక్ట్రిక్ మొబిలిటీకి పరివర్తనకు మద్దతు ఇస్తుంది.అధునాతన, సహజమైన మరియు డిజిటల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ ఆర్కిటెక్చర్ వీటిని కలిగి ఉంటుంది:

న్యూ-ఏజ్ ఎయిర్ సర్క్యూట్ బ్రేకర్స్ & హై-పెర్ఫార్మెన్స్ మోల్డెడ్ కేస్ సర్క్యూట్ బ్రేకర్స్ (ఎంసీసీబీ) లు అత్యాధునిక స్విచింగ్ మరియు రక్షణ సామర్థ్యాలను కలిగి ఉంటాయి, వివిధ అప్లికేషన్ మరియు డిజిటల్ ఆర్కిటెక్చర్ ప్లాట్‌ఫామ్‌లలో సజావుగా ఏకీకరణ కోసం రూపొందించబడ్డాయి.

- ఎండ్-టు-ఎండ్ ఇండస్ట్రియల్ ఆటోమేషన్ సొల్యూషన్స్ - స్మార్ట్‌కామ్ లాట్-ఎనేబుల్డ్ సాఫ్ట్‌వేర్ సూట్ ద్వారా ఆధారితమైన వివిక్త ప్రాసెస్ ఆటోమేషన్‌ను మెరుగుపరచడానికి రూపొందించబడిన వేరియబుల్ ఫ్రీక్వెన్సీ డ్రైవ్‌లు, పిఎల్‌సిలు మరియు హెచ్‌ఎంఐల యొక్క కొత్త పోర్ట్‌ఫోలియో.

- స్మార్ట్ న్యూమరికల్ ప్రొటెక్షన్ రిలేలు -ఎల్‌వి మరియు ఎంవి సిస్టమ్‌ల రెండింటికీ సమగ్ర రక్షణ, నియంత్రణ మరియు కమ్యూనికేషన్‌ను అందించడం

దశాబ్దాల నైపుణ్యంతో, లౌరిట్జ్ క్నుడ్సెన్ యొక్క తాజా ఆఫర్‌లు భారతదేశ ప్రాంతీయ వైవిధ్యం, రాష్ట్ర-నిర్దిష్ట విధానాలు మరియు రంగాల ప్రాధాన్యతల యొక్క లోతైన అవగాహనతో రూపొందించబడ్డాయి. దాని విస్తృత విస్తరణలో భాగంగా, కంపెనీ తన ఆవిష్కరణలను పూణే మరియు నోయిడా నుండి భువనేశ్వర్, కోయంబత్తూర్ మరియు గౌహతి వరకు 30 కి పైగా నగరాలకు భారతదేశంలోని అత్యంత డైనమిక్ పారిశ్రామిక మరియు సూక్ష్మ-మార్కెట్ క్లస్టర్‌లను లక్ష్యంగా చేసుకుంటోంది. లౌరిట్జ్ క్నుడ్సెన్ ఎలక్ట్రికల్ అండ్ ఆటోమేషన్ కేవలం సాంకేతిక ప్రదాత కంటే ఎక్కువ. ఇది సమగ్ర, స్థిరమైన మరియు భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న వృద్ధికి వ్యూహాత్మక సహాయకారి - భారతదేశం స్వావలంబన మరియు ప్రపంచ నాయకత్వం వైపు ప్రయాణానికి శక్తినిస్తుంది. పరిశ్రమ నాయకులు, సిస్టమ్ ఇంటిగ్రేటర్లు, ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు మరియు విధాన రూపకర్తలతో లీనమయ్యే ప్రదర్శనలు మరియు వాటాదారుల నిశ్చితార్థాల ద్వారా, బ్రాండ్ దాని పరిష్కారాలు జాతీయ ప్రాధాన్యతలకు నేరుగా ఎలా మద్దతు ఇస్తాయో ప్రదర్శిస్తుంది - క్లీన్ ఎనర్జీ, వ్యవసాయ సామర్థ్యం లేదా పారిశ్రామిక ఆధునీకరణలో అయినా.

## జనసేన క్రియాశీలక సభ్యులకు ఇన్సూరెన్స్ చెక్కులను అందచేసిన జగంపేట పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్.



**జగ్గంపేట జూన్27.మనం న్యూస్.** జనసేన పార్టీ క్రియాశీలక సభ్యులకు ఇన్సూరెన్స్ చెక్కులు పంపిణీ చేసిన జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రవేశపెట్టిన క్రియాశీలక సభ్యులకు ఇన్సూరెన్స్ చెక్కులు జగ్గంపేట లో అందచేశారు. ఇటీవల జగ్గంపేట నియోజకవర్గం గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామానికి చెందిన జన సైనికుడు మృతి చెందడంతో వారి కుటుంబానికి 5 లక్షల చెక్కును,కిర్లంపూడి మండలం పాలెం గ్రామానికి చెందిన జన సైనికుడు పోలిశెట్టి నాగు ఇటీవల ప్రమాదానికి గురైన కారణంగా 50 వేల రూపాయల చెక్కును, జగ్గంపేట మండలం రాజపుడి గ్రామంలో జన సైనికుడు అప్పారావుకు 40వేల రుయుల చెక్కు ఇటీవల నుండి.. చెక్కుల ఆయా జనసైనికులకు, వారి కుటుంబ సభ్యులకు తుమ్మలపల్లి రమేష్ అందించడం జరిగింది.ఈ కార్యక్రమం లో బాలు సూరంపాలెం, సత్తి సోమరాజు, ఉప్పలపాడు వెంకన్నబాబు, రాజనాల శ్రీను, సీదిరి శివదుర్గ, శివాజీ ఇతరులు పాల్గొన్నారు

## జగ్గంపేట జామియామసీదు కమిటీ ఆధ్వర్యంలో వ్యవసాయ మా ర్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ వల్లికి ఘనసత్కారం.



**జగ్గంపేట జూన్ 27: మనం న్యూస్.**జగ్గంపేట స్థానిక కాకినాడ రోడ్ లోని జగ్గంపేట జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ వల్లికి ఘన సత్కారం చేశారు. జిల్లా వర్క్ బోర్డ్ కమిటీ మాజీ చైర్మన్ గఫూర్ ఆధ్వర్యంలో పూలమాలలో సాల్వాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ కుటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పడిన జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా మా ముస్లిం సోదరులు జగ్గంపేట మండలం గుర్రంపాలెం గ్రామానికి చెందిన షేక్ వల్లిని మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా నియమించడం తో ఈరోజు మా మసీదు కమిటీ ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలు, కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించుకున్నామని మా ముస్లింలను గుర్తించి అవకాశం కల్పించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కు, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట జామియా మసీదు కమిటీ ప్రెసిడెంట్ ఆరిఫ్, చిన్న కాజా, పెద్ద కాజా, ఎండి భాష, షేక్ సలీం, సయ్యద్ బాజీ, ఎస్.కె రెహమాన్, మసీదు కమిటీ సభ్యులందరూ పాల్గొన్నారు.

## అవుట్ పాల్ స్లూయిజ్ ను పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు



**కాట్రేనికోన జూన్ 27 మనం న్యూస్:** కాట్రేనికోన అవుట్ పాల్ స్లూయిజ్ ను కే . గోపినాథ్, సూపెర్టెండింగ్ ఇంజనీర్ ఇరిగేషన్ సర్కిల్ దవళేశ్వరం., కే వెంకటేశ్వర రావు,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోదావరి సెంట్రల్ డివిజన్ అమలాపురం. ఎస్ వి వి పవన్ కుమార్ ఏ,ఇరిగేషన్ సెక్షన్ ఐనాపురం అధికారులు శుక్రవారం సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ ఈ మాట్లాడుతూ అక్టోబర్ నుండి కాట్రేనికోన, దొంతుకుర్రు స్లూయిజ్ లను మొదలుపెట్టడం జరుగుతుంది అని, అదే విధంగా ఏటిగట్టు మట్టిపనులు కూడా అప్పటి నుండే మొదలుపెడతామన్నారు. ఈలోపు ఏటుగట్టు భూములను సర్వేచేయాలనీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం డీసీ ఆకాశం శ్రీనివాస్, వైస్ డీసీ వాసంశెట్టి రాజేశ్వరరావు, నీటి సంఘం అధ్యక్షులు ఇసుకపట్ల వెంకటరమణ, పిన్నంరాజు రంగరాజు, నాయకులు విత్తనాల బుజ్జి, శీలం సూర్యనారాయణ, శీలం శ్రీనివాస, సుంకర బుజ్జి, రైతులు సంసాని శ్రీను, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

## బాపులపాడు ఏరియా వెటర్నరీ హాస్పటల్‌లో రివ్యూ సమావేశం





**హనుమాన్ జంక్షన్ : జూన్ 27 మనం న్యూస్ :** బాపులపాడు వెటర్నరీ హాస్పటల్ డాక్టర్ , సహాయ సంచాలకులు , డాక్టర్ ఎం. ప్రమిలారాణి ఆధ్వర్యములో ఏ.వి.హెచ్ బాపులపాడు స్టాఫ్ రివ్యూ మీటింగ్ శుక్రవారం జరిగింది. అలాగే బదిలీలపై వెళ్లిన వారికి వీడ్కోలు కార్యక్రమము జరిగింది. ఈ కార్యక్రమములో నూతనముగా వచ్చిన వారికి ఆహ్వానము పలుకుతూ డిపార్ట్మెంట్ ఆక్టివిటీస్ పై రివ్యూ జరిగింది.సమావేశానికి ముఖ్య అతిధులుగా డా.యన్.చిన్న నరసింహులు డి.ఏ. హెచ్ .ఓ , డాక్టర్ చంద్రమోహన్, సహాయ సంచాలకులు,గన్నవరం తదితరులు పాల్గొన్నారు.ం

## శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారికి మామిడి పళ్ళతో అలంకరణ.

మామిడి పండ్లను సమర్పించిన విజయ దుర్గ ఫ్రూట్స్ (శంకర్ ).



**పెనుమంట్ర జూన్ 27 మనం న్యూస్** : శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి 111వ సంబరం మహోత్సవం లో భాగంగా శుక్రవారం శ్రీ గౌరీ శంకర దేవాంగ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నాలుగో రోజు శ్రీ మావుళ్ళమ్మ అమ్మ వారి కి మామిడి పళ్ళ తో ప్రత్యేక అలంకరణతో దర్శనం ఇచ్చారు.అమ్మవారి భక్తుడు విజయ దుర్గా ఫ్రూట్ (శంకర్)వెలగలేరు వారు మామిడి పళ్ళను సమర్పించారు.వారికి ప్రత్యేక ధ.ం న్య వా ద వ ం ు ల ు తెలుపుతున్నామని శ్రీ మావుళ్ళమ్మఅమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ అలంకరణ కమిటీ సభ్యులు పిచ్చుక మహేష్, కొడవటి భద్ర రావు, కొమ్మాని సాయి, పిచ్చుక పూర్ణ వరప్రసాద్, వట్టం అశోక్, అల్లాడి గిరి కుమార్,మహేష్,బద్రరావు . అశోక్.పూర్ణ వరప్రసాద్ పాల్గొన్నారు.అలాగే రేపు వచ్చే ఆదివారం సాయంత్రం ఐదు గంటలు నుండి భారీ అన్న సమారాధన జరుగునని కమిటీ సభ్యులు పిచ్చుక మహేష్ తెలియజేశారు.ం

## రాణా వెల్ఫేర్ సొసైటీ సేవలు అభినందనీయం



ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

**హనుమాన్ జంక్షన్ : జూన్ 27 మనం న్యూస్ :** రాణా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జస్వంత్ శ్రీరామ్ కు 10 వ తరగతి లో 528 మార్కులు వచ్చిన సందర్భంగా రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సుంకర సాంబశివ రాయల్ రాణా విద్య ద్వారా ఇంటర్మీడియట్ విద్యాభ్యాసానికి పదివేల రూపాయలు ప్రోత్సాహ నగదు బహుమతి విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు చేతులమీదుగా జస్వంత్ శ్రీరామ్ తండ్రి సురేష్ కి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుంకర సాంబశివ రాయల్ నాలుగు సంవత్సరాల నుంచి ఆంధ్ర తెలంగాణలో కూడా విద్యార్థులకు ప్రోత్సాహ నగదు బహుమతి అందజేస్తూ అలాగే పర్యావరణ పరిరక్షణ కోసం ఎన్నో మొక్కలను నాటుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ నవనీతం సాంబశివరావు , రాణా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు గంటా కృష్ణమోహన్ ,భూపతి మహేష్ కుమార్, బాశెట్టి ప్రసాదు, చలమల శెట్టి శ్రీనివాసరావు, పండలనేని గోపాల్, తదితరులు పాల్గొన్నారు

## తిరుమల ఉద్యోగులకు హెల్మెట్ ల పంపిణీ

పాలకొల్లు లో దాత నిమ్మకాయల వెల్లడి



**పాలకొల్లు, జూన్27,మనం ప్రతినిధి :** అమలాపురంకు చెందిన దాత నిమ్మకాయల సత్యనారాయణ సహకారంతో తిరుమల లోని టీటీడీ ఉద్యోగులకు 2000 హెల్మెట్ లను టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పంపిణీ చేసారు .ఈ మేరకు వివరాలు ను దాత సత్యనారాయణ స్థానిక విలేకర్లు కు వెల్లడించారు.తిరుమలలోని చైర్మన్ అతిథిగృహంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగుల భద్రత నేపథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించి నట్లు తెలిపారు.అమలాపురంకు చెందిన వ్యాపారవేత్త , దాత నిమ్మకాయల సత్యనారాయణ రు.15 లక్షల రూపాయిల వ్యయంతో ఈ హెల్మెట్ లను సమకూర్చి టీటీడీకి అందజేసారు . టీటీడీలోని వాహనాలు నడిపే 10 వేల మంది ఉద్యోగులకు వారి భద్రతలో భాగంగా హెల్మెట్ లను ఉచితంగా అందించాలని భావించామని.. ఈ కార్యక్రమానికి పెద్దమనస్సుతో నిమ్మకాయల సత్యనారాయణ సహకరం అందించడం పట్ల చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు . మరిన్ని సేవాకార్యక్రమలతో దాత ముందు ప్రయాణం చేయాలని కోరారు . తిరుమలలో తనకు శ్రీవారి సేవను వివిధ రూపాల్లో చేసుకొనే అదృష్టాన్ని ప్రసాదించిన చైర్మన్ బీఆర్ నాయుడికి , అధికారులకు , పాలక మండలికి , కార్యక్రమానికి సహకరించిన నాగేంద్ర ప్రసాద్ కి దాత సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు .

## గొర్రె మరియు మేకలలో ఉచిత నట్టల నివారణ

నట్టల నివారణ కార్యక్రమన్ని ప్రారంభించిన ఎ ఎమ్ సి మాజీ వైస్ చైర్మన్ చనమోలు రాజశేఖర్

వెల్వడం గ్రామం, మైలవరం నియోజకవర్గం.





**మైలవరం జూన్ 27 మనం న్యూస్:** కూటమి ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా గొర్రెలకు మరియు మేకలకు వచ్చు నట్టలను నివారించటానికి ఉచితంగా నట్టల మందును లబ్ధిదారులకు అందచేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక నియోజకవర్గం శాసన సభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆదేశానుసారం మరియు తెలుగు దేశ పార్టీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మరియు నియోజకవర్గం మాజీ ఇన్చార్జి కోమటి సుధాకర్ రావు సూచనల మేరకు ఎ ఎమ్ సి మాజీ వైస్ చైర్మన్ చనమోలు రాజశేఖర్ అధ్యక్షణ అసిస్టెంట్ సర్జన్ దివ్య మరియు వెల్వడం గ్రామ పశువుల వైద్యాధికారి గణేష్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఉచితంగా నట్టల నివారణ మందును అందచేయటం జరిగినది. ఈ యొక్క కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ పశువుల రైతులు పాల్గొన్నారు.

## ఆక్రమణలను గుర్తించి, తొలగిపు చర్యలు వేగవంతం చేయాలి

– జే సి టి నిషాంతి



**అమలాపురం జూన్ 27: మనం ప్రతినిధి:** జిల్లాలో పంట కాలువలు వెంబడి ఉన్న ఆక్రమణ లను గుర్తించి తొలగిం పుకు కార్యాచరణ ప్రణా ళికను రూపొందించి సమర్పించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి, జల వనరుల శాఖ ఇంజనీర్లను ఆదే శించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు నీటి వినియోగదారుల సంఘాల ప్రతినిధులు జలవనల శాఖ ఇంజనీర్లు మూడు రెవెన్యూ డివిజన్ల రెవెన్యూ డివిజన్ అధికా రులతో సమావేశం నిర్వ హించి జిల్లాలో జల వనరుల శాఖ పరిధిలో ఉన్న ఆక్రమణలను గు ర్తించి వాటి తొలగింపుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆమె ఆదేశించారు. ఆక్రమణల మూలంగా ఎదురవుతు న్న ఇబ్బందులను దృష్టి లో ఉంచుకొని తొలగింపు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఆర్డీవోలు జలవనరుల శాఖ ఇంజనీర్ల సమన్వ యంతో ఆక్రమణలు తొలగింపుకు చర్యలు వేగవంతం చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాజకుమారి కే మాధవి, పి శ్రీకర్ బి అఖిల జల వనరుల శాఖ ఇంజనీర్లు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు

## ట్రాక్టర్ బోల్తా పడి ఓ వ్యక్తికి గాయాలు



**జంగారెడ్డిగూడెం రూరల్ జూన్ 27 (మనం న్యూస్)** : జంగారెడ్డిగూడెం స్థానిక ఏలూరు రోడ్డులో పెను ప్రమాదం తప్పింది శుక్రవారం సిమెంట్ ఇటుకలతో వెళుతున్న టాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది ఓ వ్యక్తి మీద ఇటుకలు పడటంతో స్వల్ప గాయాలయ్యాయి రోడ్డుపై ఉన్న గుంతల కారణంగా టాక్టర్ టక్కు యాకిల్స్ విరిగిపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెప్తున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీసం గుంతలైన ఓడ్చాలని వేడుకుంటున్నారు

## గ్రీన్ ఫీల్డ్ హైవే వద్ద రైతులు నిరసన



**జంగారెడ్డిగూడెం రూరల్ జూన్ 27 (మనం న్యూస్) :** జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్ల గూడెం లో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే పనులను శు క్రవారం రైతులు అడ్డుకున్నారు రహదారిపై రాస్తరోక చేశారు రైతులు మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవే సర్వీస్ రోడ్డు పక్కన ఉన్న పొలాలకు దారి ఇస్తామని చెప్పి ఇవ్వకుండా సర్వీస్ రోడ్డు మూసేశారన్నారు అధికారులు పాలకులు స్పందించి తమ పొలాలకు వెళ్లేందుకు రహదారి ఇవ్వాలని డిమాండ్ చేశారు

## వర్షపు నీరుతో మునిగిన సోమనాద్రిపురం రోడ్ల పరిస్థితి





**జంగారెడ్డిగూడెం రూరల్ జూన్ 27(మనం న్యూస్) :** జంగారెడ్డిగూడెం మండలం శోభనాద్రిపురం ఆంజనేయ కాలనీకి రోడ్డు సదుపాయం లేక అవస్థలు తప్పడం లేదు ప్రజలు రోడ్ల పైకి రావాలి అంటే భయోందాలన చెందుతున్నారు రెండు రోజులుగా కురిసిన వర్షాలకు రోడ్లు మొత్తం జలమయమై రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు దీంతోపాటు డ్రైనేజీ రహదారి నిర్మాణం లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సోమనాద్రిపురం గ్రామ ప్రజలు విన్నపం

## టార్చ్ లైట్లు సేఫ్టీ షూస్ పంపిణి



**జంగారెడ్డిగూడెం రూరల్ జూన్ 27(మనం న్యూస్) :** ఈరోజు జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయం నందు ఇంజనీరింగ్ విభాగంలో గల వాటర్ వర్కర్స్ కి భద్రత దృశ్య ఛైర్పర్సన్ బత్తిన నాగలక్ష్మీ చేతుల మీదుగా టార్చ్ లైట్లు మరియు సేఫ్టీ షూస్ పంపిణి చేయడం జరిగింది ఈ కార్యక్రమం లో కౌన్సిలర్లుచిటికెలా అచ్యుతా రామయ్య మానవతా మూర్తి వైస్సార్సీపీ నాయకులు బత్తిన చిన్న మున్సిపల్ కమీషనర్ కొమ్మినేని వేంకటరమణ ఎ ఇ రాజేష్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు టెండర్లు

## కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

**జగ్గయ్యపేట జూన్ 27 మనం న్యూస్ :** జగ్గయ్యపేట పురపాలక సంఘంలో పలు అభివృద్ధి పనులు సుమారు తొమ్మిది కోట్ల రూపాయలతో చేపట్టేందుకు టెండర్లను పిలవడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. శుక్రవారంమున్సిపల్ సాధారణ సమావేశానికి చైర్మన్ రాఘవేంద్ర అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో అజెండాలోని అంశాలను ఆమోదించడం జరిగింది. అనంతరం జరిగన చర్చలో రెండో వార్డ్ కౌన్సిలర్ కొల గాని రాము మాట్లాడుతూ పాఠశాల వద్ద స్పీడ్ బ్రేకర్లు మరియు శానిటేషన్ అస్తవ్యస్తంగా ఉందని గత కౌన్సిల్లో ప్రస్తావించినప్పటికీ ఫలితం లేకపోయినప్పుడు సమావేశాలను ఎందుకు నిర్వహించుకోవడం అని అలాంటి వాటికి సభ్యులుగా మేమెందుకు రావాలని ప్రశ్నిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ద్వారా పట్టణ అభివృద్ధి కి నిధులను తెచ్చేందుకు కృషి చేస్తున్న చైర్మన్ రాఘవేంద్ర కు అభినందనలు తెలిపారు. పట్టణంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఐదో వార్డ్ కౌన్సిలర్ వట్టెం మనోహర్ మాట్లాడుతూ తన వార్డు ప్రాంతంలో ఉన్న యాపల వాగుతోపాటు వేపల వాగుపై వంతెన నిర్మాణం తదితర సమస్యలను ప్రస్తావించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి పనులు తప్ప కొత్త ప్రభుత్వంలో పట్టణంలో జరిగిన అభివృద్ధి కనిపించడం లేదని తన అవార్డులో పట్టుమని పదివేల రూపాయల పని కూడా ఈ ఏడాది కాలంలో జరగలేదని వచ్చిన కోట్లాదినిధులను వార్డుకు10 లక్షల చొప్పున కేటాయిస్తే అభివృద్ధి పనులు జరిగేవని అన్నారు.వైస్ చైర్మన్ ఆఫీజున్నీసా మాట్లాడుతూ వీధి దీపాల మరమ్మత్తుల పేరుతో అదనపు ఖర్చు చేయకుండా చూడాలని కోరారు. అనేక ప్రాంతాలలో వీధిలైట్లు వెలగడం లేదని వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలని సూచించారు. 30వ వార్డు కౌన్సిలర్ రోశయ్య మాట్లాడుతూ బస్టాండ్ ఎదురుగా ఉన్న జగజీవన్ రామ్ విగ్రహం వద్ద పార్కు తరహాలో అభివృద్ధి చేయాలని ఇప్పటికే శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తో పాటు చైర్మన్ గా తమరికి వినతి పత్రం ద్వారా కోరడం జరిగిందని అయినప్పటికీ ఎలాంటి చర్యలు కనిపించనిందున మున్సిపల్ వారు



చేయకపోతే మాకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేయటంతో చైర్మన్ రాఘవేంద్ర జోక్యం చేసుకొని సమాధానం ఇస్తూ సమావేశంలో పెద్దగా మాట్లాడినందువల్ల నిధులు కేటాయించడం జరగదని జాతీయ నాయకుల పట్ల తమకు మరియు శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ లకు గౌరవం ఉందని తప్పనిసరిగా జగజీవన్ రామ్ విగ్రహం వద్ద చేయాల్సినటువంటి అభివృద్ధి పనులను ఎమ్మెల్యే తాతయ్య సలహా మేరకు చేపట్టడం జరుగుతుందని ప్రకటించారు. ఇదే విషయంపై తెలుగుదేశం పార్టీకి చెందిన కౌన్సిల్ సభ్యులు నకరికంటి వెంకట్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం లో కనపడనటువంటి సమస్యలు టిడిపి ప్రభుత్వంలో అడిగిన వెంటనే జరిగి పోవాలనే పోరాటం సరైంది కాదని జాతీయ నాయకుల పట్ల ఎమ్మెల్యే రాజగోపాల్ మరియు మున్సిపల్ చైర్మన్ లకు మా టిడిపి సభ్యులకు గౌరవం ఉందని తప్పనిసరిగా ఈ పనులను త్వరలోనే చేపట్టాలని కోరారు. పదో వార్డ్ కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్న ప్రాంతాలలో తక్షణమే కొత్త స్తంభాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వీధిలైట్లు సమస్యను పరిష్కరించాలని కోరారు. పట్టణంలో ఉన్న కుక్కల బెడదను కూడా తక్షణమే నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. సభ్యులు ప్రస్తావించిన సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా మున్సిపల్ అధికారులను చైర్మన్ రాఘవేంద్ర ఆదేశించారు. అనంతరం చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ శాంతినగర్ లోని పార్కు అభివృద్ధికి కోటి రూపాయలు మున్సిపల్ పార్కు 25 లక్షల రూపాయలు మున్సిపల్ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద బ్యుటిఫికేషన్ కొరకు 50 లక్షల



రూపాయలు అదేవిధంగా పలు రకాల అభివృద్ధికి పలు రకాల గ్రాంట్ల ద్వారా 8.50 కోట్ల రూపాయల నిధులు రావడం జరిగిందని తెలిపారు. పట్టణంలో పారిశుద్ధ సమస్యలను రెండు వారాలలో కమిషనర్ కృష్ణారావు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని పట్టణ మున్సిపల్ కమిషనర్ గా నూతనంగా బాధ్యతలు తీసుకున్న వారికి అపారమైన అనుభవం ఉందని అన్నారు. జగ్గయ్యపేటలో 40 ఏళ్ల నుండి డంపింగ్ యార్డ్ వలన అనేక సమస్యలు ఎదురవుతున్నాయని దాని పరిష్కారం కోసం ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్య ద్వారా ప్రత్యేక కంపోస్ట్ యార్డును తయారు చేయడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీకి చెందిన కౌన్సిల్ సభ్యురాలు గీతారాణి మాట్లాడుతూ వార్డు సమస్యలపై పలుమార్లు ప్రశ్నించినా సమస్యలు పరిష్కారం కావడం లేదని వార్డు సమస్యలు పరిష్కారం కానప్పుడు కౌన్సిలర్ గా ఉండి సమావేశాలకు రావడం ఎందుకంటు ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో అనేక ఇబ్బందులకు గురి కావడం జరిగిందని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న తన వార్డులో ఉన్న సమస్యలు పరిష్కారం కాలేదని తాను కౌన్సిలర్ గా ఉండి వార్డులో పనులు చేయించనప్పుడు తన ను నమ్మి ఓట్లేసిన ప్రజలకు న్యాయం చేయలేనప్పుడు తాను వార్డు సభ్యురాలుగా ఉండటం అనవసరమని సమస్యలు పరిష్కారం కాకపోతే వార్డు సభ్యురాలు పదవినీ వదిలేందుకు సిద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో డి ఈ ఈ శివ కోటేశ్వరరావు, రెవిన్యూ అధికారి త్రినాథ్, మేనేజర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# థైరాయిడ్ కంటి వ్యాధిపై అప్రమత్తత అవసరం

## కళ్ళను ప్రభావితం చేసే తీవ్రమైన రుగ్మత గా థైరాయిడ్

గాంధీనగర్ జూన్ 27 మనం న్యూస్: థైరాయిడ్ అనగానే జుట్టు రాలడం, శరీర బరువుకు సంబంధించిన సమస్యలు, శక్తి స్థాయిలు, హార్మోన్‌ల అసమతుల్యత లాంటి ప్రభావాలు మాత్రమే మనకు తెలుసు అని, ఈ వ్యాధి కంటిని కూడా ప్రభావితం చేస్తుందని ఎల్ వీపీఈఐ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ ఎం. సంజన అన్నారు. ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ కోడి వెంకటాద్రి చౌదరి ప్రాంగణం లో శుక్రవారం జరిగిన ఒక అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ థైరాయిడ్ కంటి వ్యాధి అనేది థైరాయిడ్ గ్రంథులు సరిగ్గా పనిచేయని వారిలో కనిపించే ఒక రుగ్మత అని, దీని కారణంగా కళ్ళ రూపంలోనూ, పనితీరులోనూ పెద్దగా మార్పులు రావచ్చు అన్నారు. హైపర్ థైరాయిడిజం (ఓవర్ యాక్టివ్ థైరాయిడ్) ఉన్నవారిలో ఇది సర్వసాధారణం అని. థైరాయిడ్ స్థాయిలు పూర్తిగా సాధారణంగా ఉన్నప్పుడు కూడా ఇది సంభవించే అవకాశం ఉందన్నారు. థైరాయిడ్ కంటి వ్యాధిలో, శరీర



రోగనిరోధక వ్యవస్థ పక్కదారి పట్టి కళ్ళ చుట్టూ ఉన్న కొవ్వు మరియు కండరాలపై ప్రభావం చూపి, అవి ఉబ్బేలా చేస్తుందన్నారు. దీని ఫలితంగా కళ్ళు ఉబ్బినట్టుగా లేదా పొడుచుకు వచ్చినట్టుగా కనిపించడం (పెద్ద కళ్ళు అని పొరపాటు పడేంతగా) కనురెప్పల ఉపసంహరణ (కళ్ళు వెడల్పుగా తెరుచుకుని ఉండి, తెల్లటి భాగం అధికంగా కనిపించడం) కళ్ళు పూర్తిగా మూసుకోవడంలో ఇబ్బంది కలగడం (లాగోఫ్తాల్మోస్) కళ్ళ చుట్టూ అసౌకర్యంగా లేదా ఒత్తిడిగా అనిపించడం ద్వంద్వ దృష్టి లేదా తీవ్రమైన కేసుల్లో దృష్టి కోల్పోవడం అనే ప్రధాన లక్షణాలు ఉంటాయని చెప్పారు. థైరాయిడ్ కంటి వ్యాధి దృష్టి కళ్ళ రూపం రెండింటిపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతుందని, ముందుగానే గుర్తించి చికిత్స అందిస్తే మంచి ఫలితాలను ఆశించవచ్చు అన్నారు. ప్రారంభ దశల్లో, వాచిన కంటి కండరాలకు చేసే ఇంజెక్షన్లు వాపును తగ్గించడంలోనూ, లక్షణాల నుండి ఉపశమనం పొందడంలోనూ సహాయపడతాయన్నారు. చికిత్స చేయకుండా వదిలేస్తే, వాచిన కండరాలు దృష్టి నాడిని కుదించగలవు, ఇది కొంతమంది రోగులలో శాశ్వత దృష్టి నష్టానికి దారితీస్తుందని చెప్పారు. థైరాయిడ్ వ్యాధి ఉన్నవారిలో కంటిలో అసాధారణ మార్పులు గమనించినట్లయితే, ముందుగానే వైద్య సహాయం తీసుకోవడం చాలా మంచిదన్నారు.

# విజయవాడలో కిస్నా డైమండ్ అండ్ గోల్డ్ జ్యువెలరీ







**గాంధీనగర్ జూన్ 27 మనం న్యూస్ :** కిస్నా డైమండ్ అండ్ గోల్డ్ జ్యువెలరీ విజయవాడ బందరు రోడ్డు సిద్ధార్థ నగర్ లో తమ ఎక్స్ క్లూజివ్ షోరూమ్ ఘనంగా ప్రారంభించినట్లు వెల్లడించింది. సంస్థకు 3వ షో రూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో హరి కృష్ణ గ్రూప్ వ్యవస్థాపకుడు అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఘనశ్యామ్ ధోలాకియా పాల్గొన్నారు. అత్యంత శుభప్రదమైన రథయాత్ర వేళ జరిగిన ఈ ప్రారంభోత్సవాన్ని వేడుక జరుపుకోవడానికి కిస్నా తమ వజ్రాభరణాల మేకింగ్ ఛార్జీలపై 100 శాతం వరకు తగ్గింపు బంగారు ఆభరణాల మేకింగ్ చార్జీలపై 25 శాతం వరకు తగ్గింపును అందిస్తుంది. వీటితో పాటుగా ఐసిఐసిఐ బ్యాంక్ క్రెడిట్, డెబిట్ కార్డులపై అదనంగా 5 శాతం తక్షణ తగ్గింపును కూడా అందిస్తోంది. హరి కృష్ణ గ్రూప్ వ్యవస్థాపకులు అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఘనశ్యామ్ దోలాకియా మాట్లాడుతూ "దక్షిణ భారతదేశంలో అధిక అవకాశాలు కలిగిన మార్కెట్ లలో విజయవాడ ఒకటి. ఈ షోరూమ్ మా వాణిజ్య కార్యకలాపాలను మరింత విస్తృతం చేయనుంది. అదే సమయంలో ప్రాంతీయ కేంద్రీకృత, వినియోగదారుల-ఆధారిత విధానం ద్వారా వ్యాపార అవకాశాలను తెరుస్తోంది. ఇది మా లక్ష్యమైన 'హర్ ఘర్ కిస్నా'కు అనుగుణంగా ఉంటుంది. భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆభరణాల బ్రాండ్గా ఉండాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తాన్న మేము, వజ్రాల ఆభరణాలను సొంతం చేసుకోవాలనే ప్రతి మహిళ కలను నిజం చేస్తున్నాము " అని అన్నారు. కిస్నా డైరెక్టర్ శ్రీ పరాగ్ షా మాట్లాడుతూ "విజయవాడ లో మా షో రూమ్ ప్రారంభంలో, ఆంధ్రప్రదేశ్ మా కార్యకలాపాలను విస్తృతం చేసుకుంటున్నాము. ఇది రోజువారీ ధారణ మరియు ప్రత్యేక సందర్భాలు రెండింటికీ అనువైన రీతిలో ప్రాంతీయ అభిరుచులను ప్రతిబింబించే ఆభరణాలను అందిస్తుంది. సాంప్రదాయ నుండి సమకాలీన శైలుల వరకు అందరికీ ఏదో ఒకటి ఈ షోరూమ్లో లభిస్తుంది. ఇది ఈ ప్రాంతంలోని ఆభరణాల కొనుగోలుదారులకు అసలైన గమ్యస్థానంగా మారుతుంది." అని అన్నారు.ఫ్రాంచైజ్ భాగస్వాములు శ్రీజి సుధాకర్ అండ్ బి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ "కిస్నా విశ్వసనీయ బ్రాండ్ కార్యకలాపాలు. స్థానిక మార్కెట్పై మా అవగాహనతో ఈ షోరూమ్ ఆభరణాల వాణిజ్యంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పడానికి సిద్ధంగా ఉందన్నారు. సంప్రదాయం ఆధునిక శైలి రెండింటినీ ప్రతిబింబించే ఉత్పత్తులను అందిస్తుంది.." అని అన్నారు.సమాజానికి తిరిగి ఇవ్వడం పట్ల కిస్నా నిబద్ధతకు అనుగుణంగా, బ్రాండ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరాన్ని , నిరుపేదలకు ఆహార పంపిణీ కార్యక్రమం కూడా నిర్వహించింది.

# ఆవాలు పోపు దినుసులు మాత్రమే కాదు.. ఆరోగ్యకరమైన ప్రయోజనాలను కూడా అందిస్తాయి..!



మన వంట ఇంటి పోపు దినుసుల్లో ఆవాలు కూడా ఒకటి. ఆవాలను మనం రోజూ అనేక కూరలు లేదా వంటల్లో వేస్తుంటాం. అయితే కేవలం పోపు దినుసుగానే కాదు, ఆరోగ్య ప్రయోజనాలను అందించడంలోనూ ఆవాలు మేటి అని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. ఆవాలలో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. ఎంతో కాలం నుంచి వీటిని వంట ఇంటి పోపు దినుసుగా ఉపయోగిస్తున్నారు. ఆవాలు అందరి ఇళ్లలోనూ ఉంటాయి. ఆవాలు మనకు పలు రకాల రంగుల్లో లభిస్తాయి. పసుపు, గోధుమ, నలుపు రంగులో ఉండే ఆవాలు లభిస్తాయి. అయితే మనం నలుపు రంగులో ఉండే ఆవాలను ఉపయోగిస్తాం. ఆవాలలో అనేక సమ్మేళనాలు ఉంటాయి. ఇవి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ఆవాలను కాస్త వేయించి పొడి చేసి దాన్ని పావు టీస్పూన్ మోతాదులో రోజూ అన్నంలో మొదటి ముద్దగా కలిపి తినవచ్చు. దీంతో అనేక లాభాలను పొందవచ్చు.

**పోషకాలు అధికం..**

ఆవాలలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ శక్తిని పెంచుతుంది. ఆవాలలో సెలీనియం, మెగ్నిషియం, మాంగనీస్, క్యాల్షియం, ఐరన్, ఫాస్ఫరస్, పొటాషియం, జింక్ వంటి మినరల్స్ సమృద్ధిగా ఉంటాయి. ఆవాలలో విటమిన్లు సి, కె, పలు రకాల బి విటమిన్లు కూడా అధికంగానే ఉంటాయి. ఆవాలలో ఉండే ప్రోటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు మనకు ఎంతో మేలు చేస్తాయి. ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు కూడా ఆవాలలో అధికంగానే ఉంటాయి. ఆవాలలో గ్లూకోసైనోలేట్స్, ఐసోథయోసయనేట్స్, సినిగ్రిన్, ఐసోర్‌హమ్‌నెటిన్, కాంప్‌ఫెరాల్, కెరోటినాయిడ్స్ అని పిలవబడే పలు రకాల యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. కణాలను ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి రక్షిస్తాయి. దీంతో వాపులు తగ్గిపోతాయి. గుండె జబ్బులు, క్యాన్సర్ రాకుండా అడ్డుకోవచ్చు. నొప్పులు, వాపుల నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది.

**క్యాన్సర్ రాదు..**

ఆవాలలో ఉండే గ్లూకోసైనోలేట్స్ క్యాన్సర్ కణాల పెరుగుదలను అడ్డుకుంటాయి. దీంతో పలు రకాల క్యాన్సర్లు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. ముఖ్యంగా పెద్దపేగు, బ్లాడర్, లంగ్ క్యాన్సర్ రాకుండా నివారించవచ్చు. ఆవాలలో ఉండే ఫైబర్ పేగుల్లో మలం కదలికలను సులభతరం చేస్తుంది. దీంతో మలబద్దకం తగ్గుతుంది. రోజూ విరేచనం సాఫీగా అవుతుంది. పేగుల్లో ఉండే వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి. జీర్ణ వ్యవస్థ క్లీన్ అవుతుంది. జీర్ణాశయ ఎంజైమ్‌లు ఉత్పత్తి అవుతాయి. తిన్న ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. అజీర్తి, గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఆవాలలో ఉండే ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు మన శరీరంలోని కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రణలో ఉంచుతాయి. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. రక్త నాళాల పనితీరు మెరుగు పడుతుంది. హార్ట్ ఎటాక్ రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

**షుగర్ లెవల్స్‌కు చెక్..**

అధ్యయనాలు చెబుతున్న ప్రకారం ఆవాలను తీసుకోవడం వల్ల షుగర్ లెవల్స్ తగ్గుతాయి. ఇన్సులిన్‌ను శరీరం సరిగ్గా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ తగ్గి డయాబెటిస్ అదుపులో ఉంటుంది. టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి ఇది ఎంతగానో మేలు చేస్తుంది. ఆవాలకు వేడి చేసే గుణం ఉంటుంది. అందువల్ల వీటి పొడిని తింటే దగ్గు, జలుబు, ముక్కు దిబ్బడ వంటి శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. వేసవి కాలంలో సహజంగానే చాలా మంది మామిడికాయలతో ఆవకాయ పచ్చడి పెడతారు. అందులో ఆవ పిండిని వాడుతారు. ఇది ఈ సీజన్‌లో మనకు మేలు చేస్తుంది. కానీ మోతాదులోనే తినాలి. ఆవాల పొడి వేసి రసం తయారు చేసి కూడా తాగవచ్చు.

# శ్రీ గోవిందమాల భక్తసమాజం ఆధ్వర్యంలో అన్న వితరణ



**గాంధీనగర్ జూన్ 27 మనం న్యూస్):** శ్రీ గోవిందమాల భక్తసమాజం గోవిందగురు స్వామి ఏనుగుల వెంకట గాంధీ బాబు ఆధ్వర్యంలో శుక్రవారం కమిటీ సభ్యులు పుప్పాల అప్పారావు చేతుల మీదుగా పూజ కార్యక్రమం అనంతరం పాత గవర్నమెంట్ హాస్పటల్ దగ్గర అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు. గత ఐదు సంవత్సరాలుగా అన్నవితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. దాత వాకా అఖిల సహకారంతో అన్నవితరణ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఏనుగుల వెంకట శ్రీనివాస్, గోపి చందన సురేష్, దత్త జ్యోతి, గద్దల ధనలక్ష్మి, పబతి కృష్ణ, యర్రంశెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# బ్రావియా 5ను విడుదల చేసిన సోనీ ఇండియా




**గాంధీనగర్ జూన్ 27 మనం న్యూస్:** ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న బ్రావియా 5ని విడుదల చేసినట్లు సోనీ ఇండియా ప్రకటించింది. ఇది దాని ఐకానిక్ బ్రావియా టెలివిజన్ శ్రేణికి తాజా జోడింపు. కొత్త ఆవిష్కరణ గృహ వినోదాన్ని పునర్నిర్వచించడానికి రూపొందించబడింది. బ్రావియా 5 మునుపెన్నడూ లేని విధంగా లీనమయ్యే వీక్షణ అనుభవాన్ని అందిస్తుంది. బ్రావియా 5 విభిన్న వీక్షణ ప్రాధాన్యతలు, నివాస స్థలాలకు అనుగుణంగా బహుళ స్క్రీన్ పరిమాణాలలో అందుబాటులో ఉంది. ప్రతి ఇంటికి సరైన ఫిట్ ఉండేలా చేస్తుంది. సోనీ యొక్క అత్యంత అధునాతన దృశ్య, ఆడియో సాంకేతికతలతో రూపొందించబడిన ఈ తాజా ఆవిష్కరణ భారతదేశంలో గృహ వినోదం కోసం కొత్త ప్రమాణాలను ఏర్పాటు చేసింది.

# న్యూయార్క్‌లో జూలై 9న నూతన ఫోల్డబుల్స్ ను విడుదల చేయనున్న సామ్‌సంగ్

**గాంధీనగర్ జూన్ 27 మనం న్యూస్:** సంవత్సరాలుగా, ప్రజలకు నిజంగా అవసరమైనది ఏమిటో, అది దృష్టిలో పెట్టుకునే తమ పరికరాలను సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ రూపొందించింది. తదుపరి తరం గెలాక్సీ పరికరాలు కొత్త ఏఐ ఆధారిత ఇంటర్‌ఫేస్ చుట్టూ రూపొందించబడుతున్నాయి. వాటి పూర్తి సామర్థ్యాన్ని తెరవటానికి హార్డ్‌వేర్ మద్దతు ఇవ్వబడుతుంది. ఈ భవిష్యత్తు ఇప్పటికే కనిపిస్తోంది. గెలాక్సీ ఏఐ అత్యుత్తమత, సామ్‌సంగ్ నైపుణ్యం ఆవిష్కరించబడబోతున్నాయి. జూలై 9న, సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ న్యూయార్క్‌లోని బ్రూక్లిన్‌లో తమ తదుపరి ఫోల్డబుల్స్ కోసం అన్‌ప్యాక్డ్ కార్యక్రమాన్ని నిర్వహించబోతుంది.

# ప్రభుత్వ లాంఛనాలతో కానిస్టేబుల్ బ్లెస్సన్ అంత్యక్రియలు





**ఆలమూరు జూన్ 27 మనం న్యూస్.** విధి నిర్వహణలో భాగంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండల కేంద్రమైన ఆలమూరు గ్రామానికి చెందిన కానిస్టేబుల్ సుంకర బ్లెస్సెన్ జీవన్(34) మృతదేహానికి శుక్రవారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఈయన ప్రస్తుతం కానిస్టేబుల్ గా ఆత్రేయపురం పోలీస్ స్టేషన్లో పని చేస్తున్నారు. అయితే బుధవారం రాత్రి ఆలమూరు ఎస్సై అశోక్, మరో కానిస్టేబుల్ స్వామి తో కలిసి డ్రైవర్ రమేష్ ను తీసుకుని ఒక గంజాయి కేసులోని నిందితులను చేదించేందుకు హైదరాబాద్ వెళు తుండగా మార్గం మధ్యలో కోదాడ మండలం దుర్గాపురం వద్దకు వచ్చేసరికి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఎస్సై అశోక్ తో పాటుగా కానిస్టేబుల్ బ్లెస్సెన్ జీవన్ అక్కడికి అక్కడే మృతి చెందారు. గురువారం రాత్రి సిఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో మృతదేహాలను బంధువులకు అప్పగించారు.బ్లెస్సెన్ జీవన్ బంధువులు, స్నేహితులు, అధికారులు,సందర్శనార్థం మృతదేహాన్ని వారి స్వగృహంలో ఉంచారు. పలువురు పోలీసు ఉన్నతాధికారులు, బంధువులు, స్నేహితులు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. శుక్రవారం ఉదయం ఆలమూరు ఏటిగట్టు సమీపాన ఉన్న గౌతమి గోదావరి నది చెంతన ఉన్న క్రైస్తవ స్మశాన వాటికలో బ్లెస్సెన్ జీవన్ అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. ఈయనకు తల్లి,ఇద్దరు సోదరులు ఉన్నారు. ఈ అంత్యక్రియల కార్యక్రమంలో కొత్తపేట డివిస్పి సుంకర మురళి మోహన్, సిఐ విద్యాసాగర్, సిఐ శేఖర్ బాబు పోలీస్ సిబ్బంది, పలువురు నాయకులు, గ్రామ ప్రజలు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అన్నదేవరపేట లోని లేఔట్ లో ఇళ్ల నిర్మాణం పరిశీలన



**తాళ్లపూడి, 27 జూన్ (మనం న్యూస్ ) :** అన్నదేవరపేట పంచాయతీ పరిధిలోకి వచ్చే ప్రభుత్వ లే ఔట్ లో ఇళ్ల నిర్మాణాలు, మౌలిక సదుపాయాలను పరిశీలించేందుకు తాళ్లపూడి ఎంపీడీఓ వేణు గోపాలరెడ్డి శుక్రవారం పలు శాఖ ల అధికారులతో ఆ ప్రాంతం లో పర్యటించారు. ఆ కాలనిలో ముఖ్యంగా గృహ నిర్మాణాలు వేగావంతం చేసే చర్యలు తో పాటు అక్కడ ఉంటూన్న ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కూడా పరిశీలించినట్లు తెలిపారు. మండలం లోని వివిధ గ్రామాల వారికి ఈ కాలనీ లో 945 మంది సైట్ లు కేటాయించగా 200 పూర్తి స్థాయి లోను, 73 లింటేల్ లెవెల్ లోను, 47 బేస్మెంట్ లేవిల్ లోను, 41రూఫ్ లెవెల్ లోను ఉన్నాయని, మిగతావి నిర్మాణాలు మొదలు పెట్టలేదని గృహ నిర్మాణ శాఖ ద్వారా నివేధికలు వున్నాయి అన్నారు. ఇప్పటికే 50 వేలు చొప్పున ప్రభుత్వం నేరుగా, రుణ సదు పాయాలు చేసినా నిర్మాణాలు పూర్తి కాలేదన్నారు. అలాగే త్రాగు నీరు, మురికి నీరు సమస్యగానే ఉన్నాయని గ్రామస్తులు తెలిపారని అన్నారు. మండల లెవెల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి అనంతరం ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళుతున్నట్లు పేర్కొన్నారు.

# బదిలీపై వెళ్తున్న మున్సిపల్ ఉద్యోగి తాజుద్దీన్ కు ఆత్మీయ సత్కారం

## చైర్మన్ రాఘవేంద్ర కౌన్సిల్ సభ్యులు ప్రసంశలు



**జగ్గయ్యపేట జూన్ 27 మనం న్యూస్ :** బదిలీపై వెళ్తున్న మున్సిపల్ ఉద్యోగి ,కౌన్సిల్ క్లర్క్ తాజుద్దీన్ బాబాకు మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం నిర్వహించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా తాజుద్దీన్ నందిగామ మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశం అనంతరం ఇప్పటివరకు మున్సిపల్ లో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ, కౌన్సిల్ క్లర్కుగా సేవలు అందిస్తూ కౌన్సిల్ ఏజెండాలు రూపొందించడం ,సమర్థవంతంగా విధులు నిర్వహించిన తాజుద్దీన్ అందరి ప్రశంసలు పొందారని చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ప్రశంసించారు. పలువురు కౌన్సిల్ సభ్యుల సైతం తాజుద్దీన్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట కృష్ణారావు, డి ఇ ఇ శివ కోటేశ్వరరావు, ఆర్ ఐ త్రినాథ్, తదితర మున్సిపల్ అధికారులు ఉద్యోగులు, కౌన్సిల్ సభ్యులు గింజుపల్లి వెంకట్రామయ్య పేరం సైదేశ్వర రావు, పి రోశయ్య ,వ ట్టెం మనోహర్, కన్నెబోయిన రామలక్ష్మి, గీతా రాణి, నకరికంటి వెంకట్ , గో ట్టే నాగరాజు, తదితర కౌన్సిల్ సభ్యులు కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

# పురుషోత్త పట్నం ఫెర్రి రేవుపాట వాయిదా..



**పోలవరం,జూన్ 27(మనం న్యూస్ ):** పోలవరం మండలంలో పోలవరం నుండి పురుషోత్త పట్నంకు గోదావరిలో లాంచిపై నడిచే ఫెర్రి రేవుపాట వాయిదా పడినట్లు పోలవరం ఎంపిడిఓ చెరుకూరి శ్రీనివాస్ బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఫెర్రి రేవుపాటకు జాయింట్ కమిటీ సభ్యులు పూర్తిగా హాజరు కాకపోవడంతో పాటను వాయిదా వేసినట్లు ఎంపిడిఓ తెలిపారు. 14మంది కమిటీ సభ్యులకు 1/3 సభ్యులు హాజరు కాకపోవడం, కోరం లేకపోవడంతో వాయిదా వేసినట్లు, తదుపరి ఫెర్రి రేవుపాటను త్వరలో నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఓ తెలిపారు. ఫెర్రిపాట పాడడానికి నలుగురు పాటదారులు హాజరయ్యారు.